ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
శనివారం 19 అక్టోబరు 2024



## న్యూస్ బాక్స్

### టెట్ పరీక్షకు 349 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 349 మంది అభ్యర్థులు గైర్హాజర య్యారు. కర్నూలు జిల్లాలో శుక్రవారం జరిగిన టెట్ పరీక్షకు 3,014 మంది ఆన్‌లైన్‌లో దరఖా స్తులు చేసుకున్నారు. ఇందులో 2665 మంది హాజరు కాగా, 349 మంది గైర్హాజరయ్యారు. ఉద యం జరిగిన పరీక్షకు 1507 మందికి గాను 1319 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 188 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1507 మంది మందికి గాను 1346 మంది హాజ రు కాగా 161 మంది అభ్యర్థులు గైర్హాజర య్యారు. ఈ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధి కారి శామ్యూల్, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేశాయి.

### ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించండి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ కళాశా లల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లించాలని ఆర్ఐవో ఎస్వీఎస్ గురువయ్యశెట్టి శుక్రవారం తెలిపారు. ఇంటర్ జనరల్ కోర్సు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు థియరీ పరీక్ష ఫీజు రూ.600, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు అదనంగా రూ.275 చెల్లించా లన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి నవంబరు 11వ తేదీ వరకు ఫీజు చెల్లించాలన్నారు. రూ.1000 ఆలస్య రుసుంతో నవంబరు 20వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్ శుక్రవారం తనిఖీ చేశారు. నగరంలోని దామోదరం సంజీవయ్య మున్సిపల్ పాఠశాల, ప్రైమరీ పాఠశాల ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ ఉన్నత పాఠశాల, టౌన్ మోడల్ పాఠశాలలను వారు తనిఖీ చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వారు పరిశీలించి ఆహార నాణ్యతను పరిశీలించారు. పాఠశాలల రికార్డులు, పరిశుభ్రత పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

# సేవ్ కప్పట్రాళ్ల..!

కర్నూలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):

కప్పట్రాళ్ల.. ఈ పేరు వినగానే గుర్తుకొచ్చేది బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన పాలేగాళ్ల పౌరుషం. అలాంటి పల్లె యురేనియం ముప్పును ఎదుర్కోబోతోంది. గ్రామం అనుకొని ఉన్న కౌలుట్లయ్యమల (కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్)లో యురేనియం నిక్షేపాలు ఉన్నాయని ఇప్పటికే ప్రాథమికంగా గుర్తించారు. ఏ మోతాదులో ఉన్నాయి..? భూగర్భంలో ఎంత లోతులో ప్రాణాంతక మూలకం నిక్షిప్తమై ఉంది..? తెలుసు కోవడానికి 68 భారీ బోర్లు డ్రిల్లింగ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇక్కడ అణు నిల్వలు గుర్తించి తవ్వకాలకు శ్రీకారం చుడితే పచ్చని పల్లెసీమ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారే ప్రమాద ఉంది. అందుకే.. తమ ఊరిలో యురేనియం తవ్వకాలు వద్దంటూ ఆ పల్లె జనం ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ పరిధిలో 468.25 హెక్టార్లు, చెల్లెలిచెలిమల గ్రామం పరిధిలో 618 హెకార్లు, నల్లచెలిమల గ్రామం పరిధిలో 759, హెక్టార్లు, గుండ్లకొండ గ్రామం పరిధిలో 762.2 హెక్టార్లు కలిపి 2,607.45 హెక్టార్లలో అటవీ శాఖ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తోంది. కప్పట్రాళ్ల గ్రామం సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాన్ని కౌలుట్లయ్యమల అంటారు. ఎందుకంటే ఆ ప్రాంతంలో కౌలుట్లయ్యస్వామి ఆలయం వెలసింది. అందుకే పేరు వచ్చిందని స్థానికులు అంటున్నారు. క్రీ.శ. 1800 ప్రాంతంలో కప్పట్రాళ్ల కేంద్రంగా పాలెగాళ్ల పాలన సాగింది. ఎంతో ఘతన చరిత్ర సొంతం చేసుకున్న కప్పట్రాళ్ల గ్రామం తాజాగా యురేనియం ముప్పును ఎందుర్కోబోతోందని తెలిసి గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ సర్వేలు జరిగితే గోల్డ్ మైన్ సర్వేలు చేస్తారని అనుకున్నారు. గుట్టుగా అధ్యయనం చేయడమే కాకుండా.. ఏం చేస్తున్నారో అధికారులు గ్రామస్తులకు నాడు చెప్పకపోవడంతో తమకేమి కాదులే అనుకున్నారు. అయితే.. ఆనాడు ప్రాణాంతక మూలకం యురేనియం కోసం సర్వేలు చేశారని ఇప్పుడిప్పుడే గ్రామస్తులు తెలుసుకుంటున్నారు. ప్రమాదకరమైన అణు ధార్మిక పదార్థాల తవ్వకాలు చేపట్ట వద్దని కోరుతున్నారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పాలకులు ఏ నిర్ణయం తీసుకున్నా ఊళ్లు వదలాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ప్రజల ఆవేదనకు అర్థం లేకపోలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడప జిల్లా వేముల మండలం తుమ్మలపల్లె వద్ద యురేనియం ప్లాంట్లు ఏర్పాటు చేశారు. భూగర్భంలో ఉన్న యురేనియం వెలికితీసి శుద్ధి చేస్తున్నారు. అణు ధార్మికతతో తుమ్మలపల్లె సహా కేకే కొట్టాల, మొబ్బుచింతపల్లె, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె గ్రామాల్లో మానవ విధ్వంసం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తున్న కరువు పల్లెసీమల్లో జీవ, వృక్షజాతి మనుగడను ప్రశ్నార్థకంగా మార్చే ఇలాంటి చర్యలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

కప్పట్రాళ్ల కొలుట్లయ్యమల అనుకొని పచ్చని పంట పొలాలు



### యురేనియం సహజ గుణం

యురేనియం భూమిలో ఉన్నంత వరకు ఎలాంటి ప్రమాదం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. భూగర్భం నుంచి వెలికితీసిన తరువాత ఆక్సిజన్‌తో చర్య జరిగాక అణుధార్మిక శక్తి గల గామా కిరణాలు 30 సెంటీ మీటర్లు కాంక్రీట్‌ను కూడా విచ్ఛినం చేసేంత శక్తివంతంగా విడుదలవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్లనే యురేనియం తవ్వకాలు చేపట్టరాదని, ఇప్పటికే చేపట్టి ఉంటే వాటిని నిలిపివేయాలని మేధావులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కప్పట్రాళ్ల గ్రామం



- మా గ్రామంలో యురేనియం తవ్వకాలు వద్దు
- ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న జనాలు
- భవితవ్యం ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన
- కలుషితం కానున్న భూగర్భ జలాలు
- హంద్రీ, తుంగభద్ర నదులపై ప్రభావం

### కప్పట్రాళ్ల పాలెగాళ్ల పౌరుషం:

కప్పట్రాళ్లకు ఎంతో చరిత్ర ఉంది. కృష్ణదేవరాయల కాలంలో జిల్లాలో 20 మందికి పైగా పాలెగాళ్లు ఉన్నారని చరిత్ర. అందులోనూ పంచపాళ్యాలు మరీ బలమైనవి. పత్తికొండ, కోటకొండ, కప్పట్రాళ్ల, దేవనకొండ, మద్దికెర. ఈ ఐదు వంశాల మూలపురుషులు ఒకరేనంటారు. ఆ సమయంలో పరప్పనాయుడు కోటకొండను పాలించారు. ప్రస్తుతం పి.కోటకొండ గ్రామంగా ఉంది. ఆనాడు కప్పట్రాళ్ల కోటను తలుచుకుంటేను శత్రువుల వెన్నులో వణుకు మొదలయ్యేది. అంత బలంగా నిర్మించుకున్నారు. పాలెగార్ చోట మాదప్ప చరిత్రను ఈ నాటికి చెప్పుకుంటున్నారు. హైదర్ అలీ దండయాత్ర తరువాత కప్పట్రాళ్లకు మాదప్ప పూర్వవైభవం తీసుకొచ్చారు. ఆనాటి పాలెగాళ్ల పౌరుషానికి గుర్తులుగా శిథిలమైన కోటగోడలు, నాడు ప్రజల దాహం తీర్చేందుకు తవ్వించిన బావులు చెరగని ముద్రగా ఈనాటికి ఉన్నాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ పల్లె సమీపంలో ప్రాణాంతక యురేనియం తవ్వకాలు చేపడితే చరిత్ర కాలగర్భంలో కలసిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు అంటున్నారు. అలాగే.. కౌలుట్లయ్యమలగా పేరుగాంచిన కౌలుట్లయ్యస్వామి క్షేత్రానికి ముప్పు తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 6లో..



### శ్రీశైలం ఈవో బదిలీ



శ్రీశైలం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజును బదిలీ చేస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం ఇన్‌చార్జి ఈవోగా దేవస్థానం సహాయ కమిషనర్ ఇ. చంద్రశేఖరరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కాగా రెవెన్యూ శాఖ డిప్యూటీ కలెక్టర్ హోదాలో డిప్యుటేషన్‌పై డి.పెద్దిరాజు శ్రీశైలం దేవస్థానం ఈవోగా కొనసాగుతున్నారు. ఆయనను మాతృ శాఖలో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## కేజీబీవీ ఉద్యోగాలకు దరఖాస్తుల వెల్లువ

- ఒక్కో పోస్టుకు 50 మంది పోటీ
- ప్రారంభమైన సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్- టీచింగ్ పోస్టుల కోసం నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డాయి. కేజీబీవీలో కాంట్రాక్ట్ విధానంలో పీఈటీ-2, సీఆర్టీలు 12, పీజీటీ పోస్టులు.. మొత్తం 27 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల కోసం 1013 దరఖాస్తులు వచ్చాయి. అలాగే, ఏపీ మోడల్ స్కూల్‌ల్లోని వసతి గృహాల వార్డెన్ పోస్టులు 6, ఆవుట్ సోర్సింగ్ కింద 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల కోసం 920 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఇవి కాకుండా కేజీ బీవీలోని వసతి గృహాల్లో హెడ్ కుక్ 4, అసిస్టెంట్ కుక్ 15, నైట్ వాచ్‌మెన్ 10, స్వీపర్ పోస్టులు 18 ఖాళీలు ఉన్నాయి. ఏపీ మోడల్ స్కూల్‌లోని వసతి గృహాల్లో ఔట్ సోర్సు కింద హెడ్ కుక్ 2, అసిస్టెంటు కుక్ 7, చౌకీదార్ 4, పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని కేటగిరిల్లో పోస్టులు 49 ఉన్నాయి. ఈ పోస్టుల కోసం 1953 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో పోస్టుకు 50.75 మంది మధ్య పోటీ నెల కొంది.

**ప్రారంభమైన అభ్యర్థుల ధృవ పత్రాల పరిశీలన**

జిల్లా సమగ్ర శిక్ష కార్యాలంలోని సమావేశ భవనంలో శుక్రవారం కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్‌లో ఖాళీ పోస్టుల కోసం జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష ఏపీసీ ఇన్‌చార్జి సామేల్ ఆధ్యర్యంలో అధికారులు అభ్యరుల్ల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ శనివారం వరకు కొనసాగుతుంది. అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తులను 1:20 చొప్పున మెరిట్ ప్రకారం అభ్యర్థుల జాబితను తయారు చేసి, తాత్కాలిక మె రిట్ జాబితాను ప్రకటించారు. ఈ మేరకు సర్టి ఫి కెట్ల వెరిఫికేషన్ జరుగుతుంది. వెరిఫికేషన్ అధి కారులుగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఆరు సబ్జెక్టులకు ఆరుగురిని నియమించారు. మొదటి రోజు సర్టిఫికెట్ల పరిశీలనకు 672 మంది హాజరయ్యారు



### రొచ్చుమర్రి రోడ్డు

మంత్రాలయం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో రోడ్లు రొచ్చుగా మారాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో వర్షం పడి నప్పుడల్లా మురుగు మట్టి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆ రోడ్లపై వెళ్లడానికి వీలు లేకుండా పోతోంది. మురుగు నిల్వ ఉండడతో పందులు, కుక్కలకు నిలయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్లపై గుంతలు ఉండటంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు కిందపడి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి.

# శిలలపై శిల్పాలు

సహజ సిద్ధంగా ఏర్పాటైన రాతి వనాలు

విచిత్ర ఆకృతులతో ఆకట్టుకుంటున్న వైనం

సినిమా షూటింగ్‌లకు సైతం ప్రసిద్ధి

ఓర్వకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):

అక్కడ శిలల కోసమే ఆ ఊరిని ఎవరో కట్టించారా అనిపిస్తుంది. సహజ సిద్ధమైన అందాల రాతివనం అది. ఎర్రకొండల్లో భాగమైన ఈ ప్రాంతం కర్నూలు నగరానికి 20 కి.మీ. దూరంలో ఓర్వకల్లు పట్టణానికి రెండు కి.మీ. సమీపంలో ఉంది. జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. అక్కడికి కుటుంబ సమేతంగా ఉదయాన్నే వెళ్లి పొద్దుగూకే వరకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందించవచ్చు. వాటర్ టవర్, గుడిసెలు, రెస్టారెంట్లు, స్టోర్ రూం సౌకర్యాలను పర్యాటక శాఖ కల్పించింది. ఉలి దెబ్బ పడితే శిల శిల్పంగా మారుతుంది. జీవం పోసుకుని పలువురిని ఆకట్టుకుంటుంది. కానీ ఒక ఉలి దెబ్బ పడకుండానే ఏ శిల్పి చెక్కకుండానే ఆరేడు కి.మీ. పొడవునా కొలువుదీరిన అపురూప శిల్ప సౌందర్యం ఇది. ఓర్వకల్లు సమీపంలోని ఈ రెండు కొండల మధ్య రాతి వనాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సెలవు రోజుల్లో పర్యాటకులతో ఈ ప్రాంతమంతా కిటకిటలాడుతుంది. రెండు కొండల నడుమ ఎర్రటి రాళ్లు, పచ్చని మొక్కలు, చల్లగా వీచే గాలులు సందర్శకులను మరో ప్రపంచంలో విహరింపజేస్తున్నాయి. పర్యాటక శాఖ ఆహారం, విశ్రాంతికి అవసరమైన సౌకర్యాలను కల్పించింది. పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20 ప్రవేశ రుసుం వసూలు చేస్తారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి ఇస్తారు. అయితే పర్యాటకుల కోసం కొండపై రోడ్లు వేశారు. రెండు కొండల మధ్య వంతెను ఏర్పాటు చేశారు. పర్యాటకులకు పున్నమి రెస్టారెంటు అన్ని ఏర్పాట్లు చేసింది.



ఏ భయం లేదు.. ఇలా నడిచేకొద్ది రాటుతేలిన రాతి సిపాయిలు దారి పొడవునా రక్షణగా నిలబడి ఉంటారు



రెండు గుట్టల మధ్య వంతెన, మధ్యలో లింగమయ్య చెరువు



చిన్ని కృష్ణుడు గోవర్ధనగిరిని చిటికెన వేలుతో ఇలాగే ఎత్తాడేమో.. కాకపోతే ఇక్కడ చిటికెన వేలుకు చూపుడు వేలు జత చేసినట్లుండే దృశ్యం

### పర్యాటకులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం



పున్నమి రెస్టారెంటుకు వచ్చే పర్యాటకులకు ప్రభుత్వం ద్వారా అన్ని వసతులు కల్పిస్తున్నాం. సెలవు దినాల్లో రాతి వనాలు పర్యాటకులతో నిండిపోతాయి. కర్నూలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి ఈ రాతి వనాలను తిలకిస్తారు. పున్నమి రెస్టారెంటు ఆధ్వర్యంలో 30 రూములు కూడా ఉన్నాయి. ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.


- జీవన్‌జాయ్, ఏపీ టూరిజం యూనిట్ మేనేజర్





### రాతి వనాల్లో తీసిన సినిమా షూటింగ్‌లు

రాతివనాల పరిసర ప్రాంతాల్లో తీసిన సినిమాలు విజయం సాధించడంతో సినీ నిర్మాతలు ఇటువైపు దృష్టి సారించారు. ఇటీవల ఈ ప్రాంతంలో టక్కరిదొంగ, జయం మనదేరా, ఆది, శంభో శివశంభో, సుభాష్ చంద్రబోస్, బాహుబలి సినిమాలు చిత్రీకరించారు. కన్నడ, తమిళం, తెలుగు సీరియల్స్ కూడా ఈ ప్రాంతంలో తీశారు.



రాక్ గార్డెన్‌లో రాతి వనాలు

## పనులు ఎందుకు చేయడం లేదు?

● అంగన్‌వాడీ కేంద్రాలలో టాయిలెట్ల నిర్మాణ పనులు పూర్తి చేయండి ● కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి : జిల్లాలో 439 అంగన్‌వాడీ కేంద్రాల్లో 231టాయిలెట్లు, 425 తాగునీటి పైప్‌లైన్లో ఏర్పాటుకు ప్రభుత్వం 1.55 కోట్ల రూపాయలను విడుదల చేసిందని నిర్మాణ పనులు పూర్తి చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని కలెక్టర్ రాజకుమారి ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. శుక్ర వారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఓ లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ గత సమావేశంలో 15రోజుల్లో పని పూర్తిచేయాలని లక్ష్యాన్ని కేటాయించినప్పటికీ 25శాతం కూడ ఎందుకు పూర్తిచేయలేకపోయారని అడిగారు. అంగన్‌వాడీ కేంద్రాలలో క్షేత్ర స్థాయిలో పనులు ఎంత వరకైందీ తాను స్వయంగా పరిశీలిస్తాని అన్నారు. రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణాల పనులను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అప్పగించాలని కలెక్టర్ ఐసిడిఎస్ పిడిని ఆదేశించారు.

### లింగ నిర్ధారణ నిషేధ బోర్డులు పెట్టండి

జిల్లాలోని 125 అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి, నిషేధ చట్టం నిబంధనల గురించి ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులు, డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని అతిక్రమిస్తే మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 50వేల రూపాయల జరిమానా, డాక్టర్లు అతిక్రమిస్తే లైసెన్సు రద్దు మొదలైన చర్యలు ఉంటాయని అన్నారు.

# రబీ శుభ సూచకమే..

● ప్రారంభంలోనే వర్షాలు.. ● పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు కొంత మేర అధిక వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో నాలుగున్నర లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వివిధ కారణాల వల్ల సాగు విస్తీర్ణం తగ్గింది. నాలుగు లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. గత సంవత్సరంతో పోలిస్తే.. ఈసారి పంట దిగుబడులు బాగానే ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లోలాగే ప్రస్తుత రబీలోనూ ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1,17,287 హెక్టార్లు కాగా, ఇప్పటికే 5వేల హెక్టార్లలో పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ప్రధానంగా పప్పుశనగ పంట 69,038 హెక్టార్లలో సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే వేయి హెక్టార్లలో ఈ పంట సాగైనట్లు వారు గుర్తించారు. వరి 4,440 హెక్టార్లు, జొన్న 10,080 హెక్టార్లు, సజ్జ 770 హెక్టార్లు, మొక్కజొన్న 6,069 హెక్టారుల, కొర్ర 1,242 హెక్టార్లు సాగవుతుందని అధికారులు చెప్పారు. కందులు 132 హెక్టార్లు, పెసలు 35 హెక్టార్లు, మినుములు 731 హెక్టార్లు, వేరుశనగ 15,449 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 376 హెక్టార్లు, ఆముదం 129 హెక్టార్లు, వాము 1,616 హెక్టార్లు, పొగాకు, 1743



హెక్టార్లు, మిరప 810 హెక్టార్లు, ఉల్లి 2,350 హెక్టార్లు పంటలు సాగు చేసే అవకాశం ఉందని జేడీ వరలక్ష్మి తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి అక్టోబరులో 40.4 ఎంఎం వర్షం కురవాల్సి ఉండగా.. ఇప్పటికే 66.2 ఎంఎం వర్షం నమోదైంది. అదే విధంగా నవంబరు, డిసెంబరు నెలల్లో కూడా వర్షాలు నిర్ణీత సమయంలో కురిస్తే రబీ సీజన్ నుంచి గట్టెక్కుతామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్టీసీకి పెరిగిన దసరా ఆదాయం

కర్నూలు(రూరల్)అక్టోబరు18: దసరా పర్వదినం పురస్కరించుకొని ఆర్టీసీకి ఆదాయం పెరిగినట్లు కర్నూలు జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు కె.సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగకు దూరప్రాంతాల నుంచి స్వంత గ్రామాలకు వచ్చే ప్రయాణికుల కోసం ఈనెల 8నుంచి 11వ తేది వరకు, 13నుంచి 16వ తేది వరకు తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను తిప్పినట్లు ఆమె వివరించారు. మొత్తం 258 ప్రత్యేక బస్సులతోపాటు షెడ్యూల్ బస్సులను ఆదనంగా నడిపినట్లు తెలిపారు. మొత్తం మీద 1.63 లక్షల కిలోమీటర్లు నడిపి 76శాతం ఆక్యుపెన్సీ రేషియోతో రూ.44 ఇపికెతో రూ.72 లక్షలు ఆదాయాన్ని ఆర్జించినట్లు వివరించారు. కాగా గత దసరా పండుగ కంటే ఈసారి పండుగకు రూ.7లక్షలు ఆదనంగా ఆదాయం వచ్చిందని అన్నారు.

### మద్యం షాపును అడ్డుకున్న ప్రజలు



ధర్నా చేస్తున్న స్థానికులు

కర్నూలురూరల్ అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం వెంకాయపల్లె వద్ద కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్న మద్యం దుకాణాన్ని శుక్రవారం చుట్టుపక్కల గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన మద్యం దుకాణ లాటరీలో కర్నూలు మండలంలో మద్యం షాపును నగరానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వెంకాయపల్లె వద్ద ప్రధాన రహదారి పక్కన్నే ఉన్న కొత్త షాపును అద్దెకు తీసుకున్నారు. మద్యం షాపును ప్రారంభించే సమయంలో చుట్టు పక్కల ఉన్న సూదిరెడ్డిపల్లె, నందనపల్లె, మిలటరీ కాలనీ, భూపాల్‌నగర్, నందనపల్లె, వెంకాయపల్లె వంటి ప్రజలు ఇక్కడ మద్యం దుకాణం పెట్టారాదని అడ్డుకుని దుకాణం ముందు ధర్నాకు దిగారు. పైగా ఈ షాపింగ్ కాంప్లెక్స్ పసుపులకు చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ పరిపతి సంఘానికి చెందనది అని స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు కేఈ వేమన్నగౌడ్ వివరించారు. కాంప్లెక్స్‌లో మొదట జగదీశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ఈ షాపును పెయింటర్స్, హార్డ్‌వేర్ కోసం అద్దెకు తీసుకొని వైన్‌షాపుదారుడికి సబ్ లీజుకు ఇచ్చారన్నారు. ఈ సొసైటి ప్రభుత్వ అనుసంధానం కింద కొనసాగుతుందని ఆయన గుర్తు చేశారు. సొసైటీ సహకార చట్టం ప్రకారం సబ్ లీజ్‌కు ఇవ్వకూడదన్నారు. గ్రామస్తులతో పాటు సొసైటీ సభ్యులు కూడా ధర్నాలో పాల్గొని మద్యం దుకాణాన్ని పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కేఈ దామోదర్‌గౌడ్, కేఈ. వేణుగౌడ్, లక్ష్మీదేవి, రాము, అభిలాష్, మహేష్, యోగి, చిన్నపరమేష్, మహేంద్ర మహిళలు పాల్గొన్నారు.

### సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వండి

ఎంపీడీవోలను ఆదేశించిన కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాల్లో గత 3 వారాల నుంచి జీరో పురోగతి ఉన్న 25 సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత మండలాల ఎంపీడీవోలను కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్ అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆప్షన్ త్రీ కింద ఉన్న ఇళ్ల నిర్మాణాల గురించి కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరితగతిన ఇళ్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూఫ్ కాస్ట్ లెవెల్‌లో ఉన్న ఇళ్లను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలన్నారు. వంద రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాల సాధనలో భాగంగా గూడూరు మండలానికి 14 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా, నెలలో కేవలం ఒక్క ఇంటిని మాత్రమే 8 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కలిసి ఒక్క ఇల్లు పూర్తి చేయడమేంటని ప్రశ్నించారు. హాలహర్వి మండలంలో కూడా 116 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంగా కాగా నెలలో కేవలం ఒకటిని మాత్రమే పూర్తి చేశారన్నారు. ఇళ్ల నిర్మాణంలో 90 రోజుల పనిదినాలు కల్పించడంలో ఆదోని, ఓర్వకల్లు, పత్తికొండ, కోసిగి, కౌతాళం, ఎమ్మిగనూరు మండలాల్లో పనిదినాలు కల్పించడంలో పురోగతి లేదన్నారు.

● క్రిష్ణగిరి మండలం వెనుకంజ: ఉపాధి హామీ సంబంధించి పని దినాలు కల్పించడంలో కృష్ణగిరి మండలం అత్యంత తక్కువ పురోగతి 34 శాతం సాధించిందని, 14వేల మంది జాబ్ కార్డులు, హోల్డర్లు ఉన్నప్పటికీ కూడా వేయి మందికి మాత్రమే పనిదినాలు కల్పించడమేమిటని ఎంపీడీవో, ఏపీవోలను ప్రశ్నించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో 4,311 ఎకరాల్లో లక్ష్యాలకు గాను 3,400 ఎకరాలు పూర్తి చేశారని, లక్ష్యాలను కూడా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన రెక్టిఫికేషన్ ఆఫ్ రెవెన్యూ రికార్డులు, యాక్షన్ అగైన్స్ట్ ల్యాండ్ గ్రాబింగ్, ఎన్క్రోచ్‌మెంటు రెగ్యులరైజెషన్ అంశాలపై ఎక్కువ కేసులు వస్తున్నాయని, ఫీల్డ్‌కు వెళ్లి వాటిని చెక్ చేసి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

# సేవ్ కప్పట్రాళ్ల..!

5వ పేజీ తరువాయి

యురేనియం తవ్వకాలు చేపడితే పచ్చని పంట చేలను ధ్వంసం చేస్తుందని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో కురిసే వర్షపు నీరు చిన్నచిన్న వంకలు, వాగులు ద్వారా హంద్రీ నదిలో చేరి తుంగభద్ర నదిలో కలుస్తాయి. తుంగభద్ర కృష్ణాలో కలుస్తుంది. యురేనియం తవ్వకాలు చేపడితే.. వాటి వ్యర్థాలు వంకలు, వాగుల ద్వారా హంద్రీ, తుంగభద్ర, కృష్ణా నదుల్లో కలిసే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే రాయలసీమ సాగు నీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుందని, నదీ జలాలు కలుషితమైతే.. ఆ నీటినే సాగు, తాగునీటికి వినియోగించడం వల్ల తీవ్రమైన నష్టాలు జరుగుతాయని, ఆ నీటితో తడసిన పొలాల్లో విషపు పంటు సాగు చేసినట్లేనని, ఆ నీరు తాగితే మనుషులు, జంతువులు ప్రమాకరమైన రోగాల భారిన పడాల్సి వస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కప్పట్రాళ్ల అడవుల్లో కౌలుట్లయ్య స్వామి ఆలయం

### జీవవైవిధ్యం ప్రమాదంలో పడుతుంది



వ్యవసాయమే మాకు జీవనాధారం.. పంట పొలాలే జీవం. యురేనియం తవ్వకాలు వల్ల వ్యవసాయ భూములు దెబ్బతింటాయి. భూగర్భ జలాలు కలుషితం అవుతాయి. అటవీ భూములు, వృక్షజాతులు, జీవవైవిధ్యం ప్రమాదంలో పడుతుంది. ప్రమాదకరమైన యురేనియం తవ్వకాలపై ప్రభుత్వాలు పునరాలోచించాలి. గ్రామస్తులకు నష్టం జరిగే ఏ కార్యక్రమైన ఉమ్మడిగా అడ్డుకుంటాం.

- గంగన్న,కప్పట్రాళ్ల గ్రామం, దేవనకొండ మండలం

### నష్టం చేకూర్చే యురేనియం తవ్వకాలు వద్దు



ఎన్నో ఏళ్లుగా కరువు కాటకాలతో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడిప్పుడే బోరు బావులు తవ్వకొని వివిధ పంటలు పండిస్తూ ఆర్థికంగా కోలుకుంటున్నాం. హంద్రీనీవా కాలువ కూడా వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదకరమైన యురేనియం తవ్వకాలు చేపడితే ఊళ్లు వదలాల్సి వస్తుంది. తాగడానికి నీళ్లు కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. నష్టం చేకూర్చే యురేనియం తవ్వకాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపట్టరాదు.

- గఫూర్, కప్పట్రాళ్ల గ్రామం, దేవనకొండ మండలం

# మద్యం, ఇసుక జోలికి వెళ్లవద్దు

● పారదర్శకంగా ప్రజలకు అందిద్దాం

● సభ్యత్వ నమోదు పకడ్బందీగా నిర్వహించాలి

● ఎంపీ, ఎమ్మెల్యే, ఇన్‌చార్జిలకు సీఎం దిశా నిర్దేశం



విజయవాడలో జరిగిన టీడీపీ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తదితరులు



సీఎం చంద్రబాబు సమావేశంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు బి.వీరభద్రగౌడ్, ఎన్.రాఘువేంద్రరెడ్డి

కర్నూలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇసుక.. మద్యం జోలికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు వెళ్లవద్దు.. పారదర్శకంగా ఇసుకను ప్రజలకు అందించాలి.. ఎవరైనా జోక్యం చేసుకొని అక్రమాలకు పాల్పడితే స్వంత పార్టీవాళ్లను కూడా ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు ప్రజా ప్రతినిధులను ఘాటుగా హెచ్చరించారు. ప్రజలకు జవాబుదారిగా ఉండాలని సూచించారు. శుక్రవారం మంగళగిరిలో ఉన్న టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా మంత్రుల టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, గౌరు చరిత, ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, బి. వీరభద్రగౌడ్, ఎన్. రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, వారి అనుచరులు ఇసుక, మద్యం దుకాణాల ఏర్పాటులో దందా సాగిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. కొందరు ఎమ్మెల్యేలు నేరుగా దందాలకు సై అంటున్నారనే ఫిర్యాదులు అధిష్టానానికి, సీఎంవో ఆఫీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారని జిల్లాకు చెందిన ఓ ముఖ్య నాయకుడు పేర్కొన్నారు. అదే క్రమంలో టీడీపీ సభ్యత్వం పకడ్బందీగా చేపట్టాలని అధినేత దిశనిర్దేశం చేశారని వివరించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ సమావేశం జరిగిందని తెలిపారు.

### బాధ్యతలు చేపట్టిన ఎస్ఈ బాలచంద్రారెడ్డి



కర్నూలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ల (ఎస్ఈ)గా బి. బాలచంద్రారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో బాలచంద్రారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారి చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు రెడ్డి శేఖర్‌రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషాను కలిశారు. జిల్లాలోని ప్రాజెక్టులు, చిన్ననీటి పారుదల చెరువులు, ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు సాగునీటిపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో చేపట్టే ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ ప్రక్రియను పూర్తి చేయండి

**కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** 2024-25 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని అన్ని కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పులకు రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రిన్సిపాళ్లను సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి శుక్రవారం ఆదేశించారు. కొత్త రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయడానికి ఆన్‌లైన్ వెబ్‌సైట్ పోర్టల్ కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. నూతన దరఖాస్తులు, రెన్యువల్స్ నమోదు ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఆయా కళాశాలలో స్కాలర్‌షిప్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

# పంచాయతీ బోరు.. వైసీపీ నాయకుని పొలానికి నీరు

- తాగునీటి ఇబ్బందుల్లో కామన్‌దొడ్డి గ్రామస్థులు

**కోసిగి అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** అధికారం పోయినా వైసీపీ నాయకులకు బరితెగింపు మాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వ నిధులతో ప్రజల దాహార్తి కోసం వేయించిన తాగునీటి బోరును ప్రజలకు అందివ్వకుండా వైసీపీ నాయకులు తన సొంత పొలానికి కట్టుకోవడమే ఇందుకు నిదర్శనం. కోసిగి మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు తలారి గోవిందు, సంజీవయ్య, అంజినయ్య ముగ్గురు అన్నదమ్ములకు గ్రామ సమీపంలోని రెండెకరాల పొలం ఉంది. ఆ పొలం పక్కనే ఆర్లబండకు వెళ్లే ప్రధాన రోడ్డులో ఆరు నెలల క్రితం తాగునీటి బోరు వేయించారు. మూడు ఇంచుల మేర మంచి నీరు పడింది. అయితే.. ఆరు నెలల వరకు మోటారు బిగించకపోవడంతో గ్రామ సర్పంచ్ భర్త నరసింహులుగౌడు ఆదేశాలతో వైసీపీ నాయకులు గోవిందు, సంజీవయ్య, అంజినేయలు ప్రభుత్వ బోరుకు మోటారు బిగించుకుని తమ పత్తి, కంది పంటకు



కామన్‌దొడ్డిలో వైసీపీ నాయకుడు పొలానికి ఉపయోగించుకుంటున్న పంచాయతీ బోరు

నీటిని వాడుకుంటున్నారు. ఓ వైపు గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉన్నా సర్పంచ్ తమ పార్టీ నాయకుల పొలాలకు నీరు పారించుకుంటున్నాడు. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు అధికారం అడ్డం పెట్టుకుని ఇలాంటి బరితెగింపు కార్యక్రమాలు ఎన్నో చేపట్టారు. ఇప్పటికీ వైసీపీ నాయకులు అధికారం కోల్పోయినా ప్రజల సమస్యలను గాలికొదిలేసి తమ సొంతానికి నీటిని వాడుకోవడమేంటని కామన్‌దొడ్డి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగు నీరు లేక ప్రజలు పొలాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ బోరు ద్వారా గ్రామస్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**ప్రజలకు బోరు ద్వారా నీరు అందిస్తాం**



గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ప్రభుత్వ బోరును మోటారు బిగించి పొలానికి వాడుకుంటున్నారన్న సమాచారం నా దృష్టికి వచ్చింది. వారిపై చర్యలు తీసుకుని ఆ బోరు ద్వారా గ్రామస్థులకు తాగునీరు అందిస్తాం. **- వెంకటేశ్వర్లు, ఎంపీడీవో**

## సీఎంను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు



సీఎం చంద్రబాబుతో మల్లెల రాజశేఖర్

**ఓర్వకల్లు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** సీఎం చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ శుక్రవారం అమరావతిలోని సెక్రటేరియట్‌లో కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, అలాగే త్వరలో ప్రారంభిస్తున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రబాబు చెప్పారని ఆయన తెలిపారు. ఓర్వకల్లు బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కృషి చేసిన సీఎంకు రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. గుట్టపాడు గ్రామాన నూతనంగా నిర్మిస్తున్న జయరాజ్ ఇస్పాత్‌ను రెండు నెలల్లో సీఎం ప్రారంభిస్తారని తెలిపారు.

## ఉర్దూ వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

**కర్నూలు, అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ లోక్‌నాథ్ తెలిపారు. ఈనెల 24 వరకు జరిగే ప్రక్రియకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎంఏ. ఇంగ్లీష్, కంప్యూటర్స్ సైన్సు, బాటనీ, ఎకనామిక్స్ ఎంఎస్‌సీ ఇండస్ట్రియల్, ఉర్దూ, కోర్సుల్లో చేరే వారు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

## పురస్కారాలకు దరఖాస్తులు

**కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం, డా.అబ్దుల్ హక్ ప్రాంతీయ స్థాయి పురస్కారానికి ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎస్.పర్వీన్ తెలిపారు. నవంబరు 11న మైనార్టీల సంక్షేమ దినోత్సవం జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఆరుగురికి జీవితకాల సాఫల్య పురస్కారాలు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ఉత్తమ విద్యార్థి పురస్కారం అందజేస్తామన్నారు.




# ఆర్‌యూలో ఆధిపత్య పోరు

- రిజిస్ట్రార్‌గా విజయ్‌కుమార్ నాయుడు బాధ్యతలు
- కనీసం పలకరించేందుకు కూడా రాని ప్రొఫెసర్లు, అధ్యాపకులు
- పాలన గాడి తప్పిందంటున్న విద్యార్థి నాయకులు

**కర్నూలు, అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** రాయలసీమ యూనివర్సిటీలో ఆధిపత్య పోరుతో విద్యార్థులు, ఉద్యోగులు నలిగిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిపాలన ఇన్‌చార్జిల చేతిలోకి వెళ్లింది. ఫలితంగా సీనియర్స్, జూనియర్స్ అనే తేడా వచ్చేసింది. ఫలితంగా అవమానాలు, దాడులు, బూతులు ఇలా రోజుకో ఘటనతో క్యాంపస్ వివాదాస్పదంగా మారింది. కొందరు ప్రొఫెసర్లు ఒకరిపై ఒకరు ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు చేసుకుంటున్నారు. విద్యాశాఖ మంత్రికి సమాచారం ఇవ్వకుండా గత వైసీపీ ప్రభుత్వంలో పని చేసిన పాలక మండలి సభ్యులతో సంతకాలు చేయించి కోర్టు కేసుతో ముడిపడి ఉన్న 14 అంశాల అనుమతుల కోసం ప్రయత్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇది చర్చకు దారి తీసింది. గత పాలక మండలిలో కొన్ని అంశాలు చర్యలకు ఆదేశిస్తే వాటిని సమర్థిస్తూ నిర్ణయం తీసుకోవడం లాంటి వాటిని ఉదహరిస్తూ ఈ ఆఫీసు పేరుతో ఉన్నత విద్యాశాఖ అనుమతుల కోసం వేచి చూస్తున్నారని, ఇటీవల కొన్ని టెండర్ల దశలోనే అడ్డుకుని వర్శిటీకి మేలు చేశామంటూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి ఓ ప్రొఫెసర్ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది.

### వర్సిటీలో వరుస ఘటనలు ఇలా..

వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా బోయ విజయ కుమార్ నాయుడు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. అయితే వర్సిటీలోని అధ్యాపకులు, ప్రొఫెసర్లు మర్యాదపూర్వకంగా కూడా శుభాకాంక్షలు చెప్పేందుకు రాకపోవడంక్యాంపస్‌లో చర్చనీయాంశమైంది. శుక్రవారం ఉదయం మొక్కుబడిగా ముగ్గురు ప్రొఫెసర్లు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రిజిస్ట్రార్‌ను పలకరించేందుకు వచ్చారు. రిజిస్ట్రార్ చాంబర్లో ముందే వేచి ఉన్న సీనియర్ ప్రొఫెసర్, కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు.. రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడును పలకరించారు. అంతలోనే సదరు ముగ్గురు ప్రొఫెసర్లు చాంబర్లోకి వచ్చి రాగానే కించపరిచే విధంగా ప్రిన్సిపాల్ నరసింహులును మాట్లాడటంతో ఆయన అక్కడే కన్నీటి పర్వంతమయ్యారు. ఇలాంటి సంఘటనలు క్యాంపస్‌లో ఎవరి జరగకూడదని, విద్యార్థులకు పాఠాలు బోధించే విశ్వవిద్యాలయంలో ఇలాంటి వివక్ష చూపించడం ఎంత వరకు సమంజసమని ఆయన విద్యార్థుల వద్ద వాపోయారు. గురువారం అర్ధరాత్రి క్యాంపస్ హాస్టల్ గదిలో ఇంజనీరింగ్ విద్యార్థి నిద్రిస్తుండగా సీనియర్ ఇంజనీరింగ్ విద్యార్థులు చొరబడి చావు దెబ్బలు కొట్టడం లాంటి ఘటనలతో విద్యార్థులకు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సంఘటనపై విద్యార్థి సంఘాలు వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేసుకుంటూ వ్యగ్యంగా చర్చించుకోవడం కనిపించింది. వర్సిటీ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకుడు రామక్రిష్ణ మాట్లాడుతూ ఒక ప్రిన్సిపాల్ పట్ల వివక్ష చూపడం సరైన పద్ధతి కాదని అన్నారు. క్యాంపస్‌లో పరిపాలన గాడి తప్పిందని, క్యాంపస్ తీరుపై ఉన్నత విద్యాశాఖ దృష్టి సారించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇది ఇలా ఉండగా వర్శిటీలో పని చేసే ఉద్యోగులను కాదని యోగి వేమన వర్శిటీ నుంచి రిజిస్ట్రార్‌ను నియమించడంపై కొందరు ప్రొఫెసర్లు అసహనంతోనే ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఎవరూ కలవడం లేదంటూ మరి కొందరు విద్యార్థులు చర్చించుకోవడం కనిపించింది.

## దౌర్జన్యంగా మద్యం దుకాణం మూయించారు..

**సీఎంకు ఫిర్యాదు చేస్తా: టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**కర్నూలు, అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** కోడుమూరు టీడీపీ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి దౌర్జన్యంగా మద్యం షాపు మూయించాడని ఆ పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ నిర్వహించిన లాటరీ ప్రక్రియలో మద్యం షాప్ దక్కించుకున్న వాళ్లకు దుకాణం నడుపుకునే హక్కు లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండి.. సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించినా తమ షాపు బలవంతంగా 30 మంది రౌడీలను పంపించి మూయించారని ఆరోపించారు.

## రక్షణ కల్పించండి

- గాంధీ విగ్రహం వద్ద బాధితుల ఆందోళన



గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

**డోన్ రూరల్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** పట్టణానికి చెందిన న్యాయవాది కృష్ణప్రసాద్ నుంచి రక్షణ కల్పించాలని బాధితులు కోరారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. అనంతరం డోన్ డీఎస్పీ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. బాధితులు సంగుస్వామి రెడ్డి మాట్లాడుతూ డోన్ పట్టణం ఇందిరానగర్‌లో తాము నివాసముంటున్నామ న్నారు. తమకు ఉడుములపాడు గ్రామ సమీపంలో రెండెకరాల 13 సెంట్ల పొలం ఉందని, తమ పొలం పక్కన డోన్ పట్టణానికి చెందిన న్యాయవాది కృష్ణప్రసాద్‌కు కంకర ఫ్యాక్టరీ ఉందన్నారు. కంకర ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ముధూళితో పంట నాశనమవుతుందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. వీటిని సహించలేక న్యాయవాది కృష్ణప్రసాద్ తన కుమారుడు హరీష్, తమ్ముడి కుమారుడు హరితో కలిసి గత నెల 12వ తేదీన ఓ వాహనంతో నాశనం చేశారని ఆరోపించారు. డీఎస్పీ శ్రీనివాసులు న్యాయవాది కృష్ణ ప్రసాద్ నుంచి రక్షణ కల్పిస్తామని, భవిష్యత్తులో బెదిరింపులకు పాల్పడితే.. నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పిర్యాదు చేయవచ్చని భరోసా ఇచ్చారు.



## దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

- 43 తులాల బంగారు నగలు స్వాధీనం

**కర్నూలు క్రైమ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** కర్నూలు, నంద్యాల జిల్లాలో రెండేళ్లగా వరుస చోరీలకు పాల్పడుతున్న అల్తాఫ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, తాలుకా సీఐ శ్రీధర్, మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డిలు శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కల్లూరు ఫారుక్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్ ఆలియాస్ అల్తాఫ్ జులాయిగా తిరుగుతూ గత రెండేళ్లగా ఈ దొంగతనానికి పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరు నిందితులు మహేష్, బాలకృష్ణలతో కలిసి ఈ చోరీలు చేస్తున్నట్లుగా గుర్తించారు. ఇటీవల పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు చోరీలు వెలుగులోకి వచ్చాయి. అల్తాఫ్ కర్నూలులో పెయింటింగ్ పనులు చేస్తూ మిగతా ఇద్దరు నిందితులతో కలిసి రాత్రివేళల్లో తాళం వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడుతుంటారు. కర్నూలు త్రీటౌన్, ఫోర్త్ టౌన్, తాలుకా, నంద్యాల టూటౌన్, తాలుకా పోలీస్ స్టేషన్ల పరిధిలో 36 చోరీల్లో ఈ నిందితులు పాల్గొన్నారు. అల్తాఫ్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 43 తులాల బంగారు నగలు, 279 తులాల వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసును చాకచక్యంగా చేధించిన సీఐలతో పాటు ఎస్ఐలు మన్మథ విజయ్, చంద్రశేఖర్ రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, కృష్ణ, తులసి, ఖాద్రి, కిరణ్, ఎల్లశివుడును డీఎస్పీ అభినందించారు.

## ఈవో సస్పెన్షన్

**కర్నూలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఓర్వకల్లు మండలంలోని బుగ్గ రామేశ్వరం ఆలయంలో జరిగిన భారీ కుంభకోణంలో ఈవో బీఆర్‌కే ప్రసాద్‌ను శుక్రవారం దేవ దాయ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన యాగంటి ఆలయ ఈవోగా పనిచేస్తున్నారు. కాల్వ బుగ్గ రామేశ్వరం ఆలయ ఈవోగా ఉన్న సమయంలో ఆలయ నిధులను సొంత ఖాతాకు మళ్లించి.. ఆ తర్వాత తన బినామీల ద్వారా డ్రా చేసి స్వాహా చేశారని విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. దాదాపు రూ.1.35 కోట్లు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయన బదిలీపై వెళ్లాక ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో దేవదాయశాఖ అధికారులు విచారణ చేపట్టారు.

## ప్రజలతో మమేకమైతేనే సమస్యలు పరిష్కారం

- నేరాల నియంత్రణకు కృషి చేయాలి
- ఎస్పీ బిందు మాధవ్



మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

**తుగ్గలి అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** పోలీసులు ప్రజలతో మమేకమై పని చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కరించగలమని, నేరాల నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని ఎస్పీ జి. బిందుమాధవ్ అన్నారు. శుక్రవారం తుగ్గలి, జొన్నగిరి పోలీస్‌స్టేషన్లను వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించి తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించడంతో పాటు పోలీస్‌స్టేషన్‌ల ఆవరణలను పరిశీలించారు. అలాగే పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు ఉంటే వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని నిందితుల అరెస్టు, దర్యాప్తులు ఎలా చేపడుతున్నారని సీఐలు, ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ముఖ్యమైన కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ చేయాలని, అప్పుడే సమర్థవంతంగా కేసులను ఛేదించవచ్చని, నేరాలను తగ్గించవచ్చని అన్నారు. ఎస్పీ వెంట పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు పులిశేఖర్, ప్రసాద్, ఎస్ఐలు జయశేఖర్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

## గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

**మహానంది, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి):** మహానంది సమీపంలోని తెలుగగంగ ప్రధాన కాలువలో శుక్రవారం ఇంటర్ విద్యార్థి గౌతమ్ సిద్దార్థ (17) మృతదేహం లభ్యమైంది. శుక్రవారం రుద్రవరం సమీపంలోని తెలుగు గంగ కాలువ తుండ్లవాగు రిజర్వాయిర్ వద్ద గుర్తించినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పూర్తయ్యాక తల్లితండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- నిందితుల అరెస్టు, వాహనం సీజ్
- 7,680 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం



మద్యం, వాహనం, నిందితులను చూపుతున్న డీఎస్పీ

**డోన్ రూరల్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** డోన్ పట్టణం వైఎస్ నగర్ పరిసర ప్రాంతంలో భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బొలేరో వాహనంలో 80 గెలాక్స్ విక్సీబాక్సులలో తరలిస్తున్న 7,680 టెట్రా మద్యం ప్యాకెట్లను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితులు ఈడిగ సురేంద్ర (గుడిగుప్పరాళ్ల గ్రామం తుగ్గలి మండలం చెందిన ఈయన ప్రస్తుతం వైఎస్ నగర్‌లో ఉంటూ అక్రమ మద్యం చేస్తూ పట్టుబడ్డారని అన్నారు. ఈయనతో పాటు కృష్ణగిరి మండలం సంగాల గ్రామం హరిప్రకాష్ గౌడు, బీసీ కాలనీ, తుగ్గలి గ్రామానికి చెందిన మునీకంట గౌడు, డోన్, వైఎస్‌నగర్‌కు షేక్ దస్తగిరిలను అరెస్టు చేశామన్నారు. వీటిపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

● బార్ అసోసియేషన్ డిమాండ్



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ నాయకులు

**కర్నూలు లీగల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కర్నూలు బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక బార్ అసోసియేషన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పిందన్నారు. ఈ అంశంపై ఎటువంటి తీర్మానం చేయకపోవడం శోచనీయమన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి ముఖ్యమంత్రిపై ఒత్తిడి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలని అన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమ ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో ప్రస్తుత ప్రభుత్వం సరైన రీతిలో స్పందించడం లేదని అన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఒట్టి మాటలను కట్టిబెట్టి త్వరలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంటు నిత్యజీవన్‌రాజు, జాయింట్ సెక్రటరీ విక్రమ్ సింగ్, సీనియర్ న్యాయవాదులు ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, ఎస్.చాంద్‌బాషా, మురళి మనోహర్ పాల్గొన్నారు.

## సుంకులాపరమేశ్వరికి బంగారు తాళిబొట్టు



ఆలయ సిబ్బందికి బంగారు తాళిబొట్టు అందజేస్తున్న భక్తులు

**గూడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):** మండలంలోని కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారికి కర్నూలు తడకనపల్లెకు చెం దిన శ్రీనివాసులు దంపతులు ఆరు గ్రాముల బంగారు తాళి బొట్టు కానుకగా సమర్పించినట్లు ఆలయ సిబ్బంది కేశవ తెలిపారు. శుక్రవా రం కె నాగలాపురం సుంకులాపరమేశ్వరిని శ్రీనివాసులు దంపతులు దర్శించుకుని, అమ్మవారికి ఆరు గ్రామలు బంగారు తాళి బొట్టు కానుకగా సమర్పించారు.

## తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

**కర్నూలు న్యూసిటీ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్ రంజిత్ బాషా కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కల్లూరు మండల పరిధిలో పెద్దపాడు గ్రామంలో 10ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం కోసం 1 నుంచి 6 ఎకరాలు, అదేవిధంగా కర్నూలు మండలంలోని దిన్నె దేవరపాడు గ్రామంలో 1.50 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు నగర పాలక అధికారులు కసరత్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మంత్రి టీజీ భరత్ ఆదేశాల మేరకు నగరంలో శాశ్వత తాగునీటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

## కర్నూలు జీజీహెచ్ డైటీషియన్‌గా రామాంజనేయులు

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 6 ఏళ్లుగా ఖాళీగా ఉన్న డైటీషియన్ పోస్టును డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ భర్తీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు మెడికల్ కాలేజీలో ఎన్‌ఎంఏగా పని చేస్తున్న రామాంజనే యులుకు పదోన్నతి కల్పించి డీఎంఈ కర్నూలు జీజీహెచ్‌లో డైటీషి యన్‌గా పోస్టింగ్ వేశారు. ఈ మేరకు కర్నూలు జీజహెచ్‌లో డైటీషియ న్‌గా రామాంజనేయులు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## టెండర్ దాఖలుకు గడువు పెంపు

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు మెడికల్ కాలేజీలో కలర్ డాప్లర్ టుడికో కార్డియోగ్రఫీ మిషన్ కొనుగోలుకు ఈ నెల 26వ తేదీ వరకు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు టెండర్ గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ కోత ఉంటుందని ఏడీఈలు రాజేంద్రబాబు, నాగప్రసాద్, సుబ్బన్నలు తెలిపారు.

# కొత్త బస్టాండ్‌లో ట్రాఫికర్



లోపలికి వస్తున్న ప్రైవేట్ వాహనాలు

బస్సుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న ఆటోలు

ఆటకెక్కిన మరుగుదొడ్ల నిర్వహణ

దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



**కర్నూలు(రూరల్), అక్టోబరు 18:** కర్నూలు కొత్తబస్టాండ్‌లో ట్రాఫిక్ నానాటికీ పెరుగుతోంది. అనుమతి లేకుండా ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలు విచ్చలవిడిగా బస్టాండ్ లోపలకు వస్తున్నాయి. ఏకంగా ప్లాట్‌ఫారాల వద్దకు వచ్చి బస్సులకు అడ్డంగా పెట్టి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేస్తున్నాయి. తద్వారా బస్సులను వెనక్కి తిప్పాలన్నా, ముందుకు వెళ్లాలన్నా ఆర్టీసీ డ్రైవర్లకు ఇబ్బందిగా ఉంది. ప్రయాణికులకు ప్రమాదాలు జరిగే పరిస్థితి కూడా ఉంది. మరోవైపు కార్గో పేరుతో ఆటోలు లోపలకు వచ్చి కల్లూరు వైపు వెళ్లే మార్గం గుండా వెళ్లుతున్నాయి. ప్రైవేట్ వాహనాలను నియంత్రించటంలో ఆర్టీసీ పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● ఆటకెక్కిన మరుగుదొడ్ల నిర్వహణ: నిత్యం రద్దీగా ఉండే కర్నూలు బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ ఆటకెక్కింది. మెరుగైన సౌకర్యాల కోసం ప్రయాణికుల నుంచి అదనంగా సెస్‌ను వసూలు చేస్తున్నారుగాని ఆర్టీసీ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. మరుగుదొడ్లకు తాళాలు వేశారు. దీంతో ఎక్కడిపడితే అక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారు. మరుగుదొడ్లు లేక మహిళలు చాలా ఇబ్బందిపడుతున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండులో కొన్నిప్లాట్‌ఫారాల వద్ద మరమ్మతు పనులు రోజుల తరబడి చేస్తుండటంతో ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

● హద్దుల దాటుతున్న స్టాల్స్ నిర్వాహకులు: బస్టాండ్ ప్రాంగణంలో దాదాపు రెండు వందలకు పైగా వివిధ దుకాణాలు ఉన్నాయి. చాలా చోట్ల ఎమ్మార్పీ ధరలకు అమ్మకాలు జరపడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ కేటాయించిన స్థలంలోనే స్టాల్స్‌ను నిర్వహించుకోవాలనే షరతు ఉంది. కానీ కొంతమంది స్టాల్స్ నిర్వాహకులు దుకాణం ముందు ఖాళీ స్థలం కూడా ఆక్రమించుకున్నారు.

● కొరవడిన అధికారుల పర్యవేక్షణ: కొత్తబస్టాండ్‌లో ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బస్ స్టేషన్ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. బస్సు ప్రాంగణం పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నా, ప్రయాణికులు కూర్చునే కుర్చీలు ఇరిగిపోయినా పట్టించుకో లేదు. ఆర్టీసీ ఉన్నతాధికారుల పర్యటన సమయంలో మాత్రం స్థానిక అధికారులు స్టాల్స్‌ను తనిఖీ చేసి మిగిలిన రోజుల్లో చేతులు దులుపేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ పౌర సంక్షేమ సంఘం ఫిర్యా దులను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.



కొత్తబస్టాండ్ వద్ద బస్సుల రాకపోకలకు అడ్డదిడ్డంగా ఉన్న ఆటోలు

## పంచాయతీ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి: డీపీవో

**ఓర్వకల్లు అక్టోబరు 18,(ఆంధ్రజ్యోతి):** గ్రామ పంచాయతీ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని డీపీవో భాస్కర్ అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యు లు, పంచాయతీకి ఇద్దరు చొప్పున గ్రామస్థులతో పంచాయితీ వ్యవస్థపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును డీపీవో భాస్కర్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సాధారణ పరిపాలన విధా నం, 1994 పంచాయతీరాజ్ చట్టం, గ్రామ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్ బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, విద్యుత్ దీపాల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సామాజిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లుగా మురళి, జే.పరిమళ, ఎస్‌ఐ ఆర్‌డీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఎంపీపీ తిప్పన్న, ఈవోఆర్‌డీ సుబ్బరా యుడు, పంచాయతీ కార్యదర్శులు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

## లైఫ్ స్కిల్స్ తప్పనిసరి: ప్రిన్సిపాల్

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** ప్రతి వైద్యవిద్యార్థికి బేసిక్ లైఫ్ స్కిల్స్ తప్పనిసరి అని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టినరసమ్మ అన్నారు. శుక్రవారం అనస్థీషియా విభాగంలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఇంటర్న్‌షిప్‌కు బేసిక్ లైఫ్ సపోర్టు స్కిల్స్ ముగింపు శిక్షణ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బీఎల్ఎస్ స్కిల్స్ వినియో గించడం ద్వారా ప్రాణాలను కాపాడు వచ్చునన్నారు. శిక్షణలో 265 మంది ఇంటర్నీస్‌కు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ సాయిసుధీర్, అనస్థీషియా హెచ్‌వోడీ విశాల, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలత, పీడీయాట్రిక్ ప్రొఫెసర్ రవీంద్రనాథ రెడ్డి, కార్డి యాలజీస్టు ప్రశాంత్ పాల్గొన్నారు.

## 29 నుంచి సమ్మెలోకి వైద్య సేవా మిత్రలు

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 29 నుంచి సమ్మెలోకి వెళ్తామని డా.ఎన్టీఆర్ వైద్యసేవల ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. లక్ష్మి ప్రసన్న, జి. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా ఎన్టీఆర్ వైద్యసేవమిత్రలు, టీం లీడర్లు, డిస్ట్రిక్ట్ మేనేజర్లు, ఆఫీసు అసోసియేట్లు సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.

## క్రీడా పోటీలు ప్రారంభం

**కర్నూలు స్పోర్ట్స్ అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి హాజరై వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. విద్యాశాఖ సహాయ డైరెక్టర్ శామ్యూల్ పాల్ మాట్లాడారు. వాలీబాల్ నెట్‌బాల్, ఆర్చరీ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంఈవో-2 విజయకుమారి, టౌన్ మోడల్ పాఠశాల హెచ్‌ఎం రాజకుమారి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య, పీడీలు కిషోర్, పరమేష్, కృష్ణ, శ్రీనివాసులు, వేణుగోపాల్, కోసిగి ఖలీల్, గణపతి, వెంకట్, సతీష్ పాల్గొన్నారు.

## మహిళా కార్మికులకు లైసెన్సులు ఇవ్వండి

**కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** కర్నూలు మార్కెట్ యార్డులో మహిళా కార్మికులు లైసెన్సులు ఇవ్వాలని శ్రామిక సంఘం రాష్ట్ర నాయకురాలు నిర్మలాదేవి మార్కెట్‌యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మిని కోరారు. వెంటనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి లైసె న్సులు జారీ చేస్తామని సెక్రటరీ జయలక్ష్మి హామీ ఇచ్చారు.

## హార్ట్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా రామ్‌శంకర్ నాయక్

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** కర్నూలు హార్ట్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా కర్నూలు మాజీ కలెక్టర్ రామ్‌శంకర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నగరంలోని ఎ.క్యాంపులో హార్ట్ ఫౌండేషన్ కార్యాలయంలో డాక్టర్ పి.చంద్రశేఖర్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. నూతనంగా ఎన్నికైన రిటైర్డు ఐఏఎస్ రామ్‌శంకర్ నాయక్ మాట్లాడుతూ హార్ట్ ఫౌండేషన్ సేవలు జిల్లా, నగరప్రజలకు మరింత విస్తృతం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలోని విద్యార్థులకు గుండె జబ్బులపై అవగాహన కల్పించాలని కోరారు.

## చనుగొండ్లలో ఎస్‌ఐ పల్లె నిద్ర

**గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో ఎస్‌ఐ తిమ్మయ్య పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఎస్‌ఐ తిమ్మయ్య గ్రామస్థులతో మాట్లాడుతూ సైబర్ క్రైం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## నగరంలో రోడ్ల విస్తరణ

**కర్నూలు న్యూసిటీ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** నంద్యాల చెక్‌పోస్టు నుంచి నందికొట్కూరు రోడ్డులో ఉన్న ఎస్‌ఎస్ గార్డెన్ వరకు రోడ్ల విస్తరణ జరగనుంది. ఈ మేరకు సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆ రోడ్డుకు సంబంధించి కేటాయించిన ప్లానింగ్ కార్యదర్శులు కొలతలు, డ్రాయింగ్‌లు వేసి నివేదికలను సీపీకి అందజేయనున్నారు.

## రైతు బజారు తనిఖీ



ఉల్లి గడ్డలను పరిశీలిస్తున్న జేడీ

**కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** నగరంలోని సి.క్యాంపు రైతుబజారును మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు శుక్రవారం తనిఖీ చేశారు. రైతుబజారును తీర్చిదిద్దినందుకు ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్‌ను జేడీ అభినందించారు. బయటి మార్కెట్‌లో ధరలు పెరుగుతున్న సమయంలో సి.క్యాంపు రైతుబజారు ప్రజలకు అండగా నిలబడడం సంతోషించదగ్గ విషయమన్నారు. రైతులను, విని యోగదారులను కూరగాయల క్రయవిక్రయాలపై అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా రైతుబజారు అధికారులు, సిబ్బంది ప్రతిరోజు కూరగాయలు కొనడానికి వేలల్లో వినియోగదారులు ఇక్కడకు వస్తున్నా రని, విస్తరించేందుకు రెవెన్యూ క్వార్టర్స్‌ను సంవత్సరాల కిందటే రైతు బజారుకు అప్పగించారని, వెంటనే ఆ స్థలంలో రైతుబజారును విస్తరిం చేందుకు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్కడే ఉన్న డీఈఈ రఘునాథరెడ్డి మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తిని వెంటనే శిథిలావస్థకు చేరిన బిల్డింగులను పడగొట్టి స్థలాన్ని రైతుబజా రుకు అప్పగించి అవసరమైన పనులు చేపట్టాలని ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. జేడీ వెంట ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, ఉద్యానవన శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులు గురువయ్య, శ్రీనివాసరెడ్డి, గోపాల్, హనుమంతు, చిన్నస్వామి, ఉన్నారు.

## మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

**కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నగర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలన్నారు. గతంలో నగర కమిషనర్ ఉపాధ్యాయులకు డిప్యూ టేషన్ వేశారని, వీటిన్ని రద్దు చేసి ఇటీవల విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు కింద ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటిల్, కార్యదర్శి సర్వేశ్వర రెడ్డి, నగర అధ్యక్షులు ఇబ్రహిం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఖోఖో క్రీడాభివృద్ధికి సహకరిస్తా

**కర్నూలు స్పోర్ట్స్ అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఖో-ఖో క్రీడాభివృద్ధికి సహకరిస్తానని న్యాయవాది శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఖో-ఖో జూనియర్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. పోటీలకు 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. శ్రీధర్ రెడ్డి క్రీడాకారులకు భోజన వసతి కల్పించారు. ఖో-ఖో సంఘం ప్రతినిధులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ క్రీడాదాత శ్రీధర్ రెడ్డి క్రీడాకారులకు సహకారాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఖో-ఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, ప్రభాకర్, చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి, పీఈటీ, పీడీలు ఖలీల్, సురేష్ నాయుడు, శేషు, కృష్ణ, పద్మలత, స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య, డీఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.



## ఉల్లి రైతులను ఆదుకోవాలి

**కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఉల్లి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతులను పరామర్శించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఉల్లి పండిస్తున్నారని, ఖర్చులు పెరుగుతున్నా లాభాలు మాత్రం రైతులకు కనిపించడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వమైనా రాయితీ డబ్బులను చెల్లించాలని కోరారు. అనంతరం మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మికి వినతి పత్రం అందించారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**కర్నూలు, న్యూసిటీ అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** నగర పాలక సంస్థ ప్రజా ఆరోగ్య విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్క రించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్ ఎస్. రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ కార్మికుల సమస్యలు దీర్ఘకాలం నుంచి అపరి ష్కృతంగా ఉన్నాయన్నారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వాలని, సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొన్న కార్మికులకు భత్యం ఇప్పించాలని, పెండింగ్ స్టిచింగ్ చార్జిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, శ్రీను, రాముడు, రాజశే ఖర్ పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధిపై అవగాహన

**సి.బెళగల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లకు పరిపాలన విధానం, నిధులను ఖర్చులపై రెండు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు. పంచాయతీరాజ్ సెక్రటరీ సునీల్‌రాణి, ఈవోఆర్డీ ఈశ్వరస్వామి, పాల్గొన్నారు.

## భూ వివాదాల పరిష్కారమే రీసర్వే లక్ష్యం: జేసీ



తిప్పాయపల్లెలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ

**ఓర్వకల్లు అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** భూవివాదాల పరిష్కారమే రీసర్వేల లక్ష్యమని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో రీసర్వేలో వచ్చిన భూ సమస్య పరిష్కార గ్రామ సభకు ఆమె ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సభకు తహసీల్దార్ విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో తమకు అన్యాయం జరిగిందని, పాసు పుస్తకాల్లో ఉన్న కొలతలు, రీసర్వేలో వచ్చిన కొలతలు చాలా తేడా ఉన్నాయని రైతులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూ ఆక్రమణ సెక్షన్ 22ఏ తారుమారుకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. సర్వేయర్ బీఏ సుబ్బా రెడ్డి, రీసర్వే డీటీ షర్మిలారెడ్డి, సర్వేయర్ శంకర్‌శర్మ, వీఆ ర్వో జనార్దన్, సర్పంచ్ కృష్ణవేణమ్మ, నాయకులు సుధాకర్ రెడ్డి, హరినాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**కల్లూరు:** గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసుకోవడానికే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని కల్లూరు తహశీల్దారు కె.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం పందిపాడు గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రైతులు సంయమనంతో వ్యవహరించి రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసుకునేందుకు భూ విస్తీర్ణంలో తేడాలు, ఒకే సర్వే నెంబరులో అన్నదమ్ముల భాగాలను విడిగా చేసుకోవడం , ఎల్‌పీఎం నెంబర్ల మార్పునకు అర్జీలు ఇవ్వాలన్నారు. అనంతరం రైతుల నుంచి తహసీల్దార్ అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు శేఖర్‌చౌదరి, పూల శంకర్, భీమ్మడు, గొల్ల లక్ష్మణ్, శివ, భీమేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**సి.బెళగల్:** రైతు సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలుకుదొడ్డి, సంగాల గ్రామాలలో గ్రామ సభలను తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రైతులు భూ సమస్యలపై అధికారులకు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

**గూడూరు:** రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలను పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరు మండలం పోన్నకల్‌లో గ్రామసభలను నిర్వహించారు. అనంతరం రైతుల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సమావేశంలో రీ సర్వే డీటీ లోకేశ్వర రెడ్డి, సర్వేయర్ బాలు నాయక్, సీనియర్ అసిస్టెంట్ రాఘ వేంద్రా రెడ్డి, వీఆర్‌వో జాకీర్, సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

**కోడుమూరు రూరల్:** గత ప్రభుత్వం రీసర్వేలో జరిగిన తప్పులను రైతులు సరిచేసుకోవడానికి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ తెలిపారు. అమడగుంట్ల గ్రామంలో శుక్ర వారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు గత రీసర్వే తప్పిదాలపై అర్జీలు సమర్పించారు. ఇందులో జాయింట్ ఎల్‌పీఎం విభజించాలని 31 దరఖాస్తులు, భూ విస్తీర్ణంలో వ్యత్యాసంపై 11, ఆన్‌లైన్‌లో పేరు కనిపించడం లేదని ముగ్గురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మీ, మండల సర్వేయర్ సునీల్, ఆర్ఎస్ డీటీ క్రిష్ణమూర్తి, వీఆర్వో మధుసూదన్ పాల్గొన్నారు.

● **షెడ్యూల్ ఇదే:** రీసర్వే జరిగిన గ్రామాల్లో తప్పిదాలను సరిచేయడానికి ప్రభుత్వం ప్రత్యేక గ్రామ సభల ఏర్పాటుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా మండలంలో శనివారం వర్కూరు, 22న పులకుర్తి, 23న ముడుమలగుర్తి, 24న అనుగొండ గ్రామాల్లో గ్రామసభలు జరుపుతున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

## తప్పిపోయిన బాలుడిని గుర్తించిన పోలీసులు

**పత్తికొండ, అక్టోబరు 18:** స్థానిక బాలుర హాస్టల్ నుంచి తప్పిపోయిన విద్యార్థిని పోలీసులు గుర్తించి, హాస్టల్ అధికారులకు అప్పగించారు. తుగ్గలి మండల గుడిసెగుప్పరాళ్ల గ్రామానికి చెందిన సూరి కుమారుడు అరవింద్ పత్తికొండ హాస్టల్‌లో ఉండి ఆరో తరగతి చదువుకుంటున్నాడు. సెలవులకు ఊరికి వెళ్లిన అరవింద్‌ను శుక్రవారం తండ్రి హాస్టల్‌లో వదిలి వెళ్లాడు. తనతోటి విద్యార్థులు ఇంకా హాస్టల్‌కు రాకపోవడంతో అరవింద్ హాస్టల్ నుంచి కనిపించకుండా పోయాడు. వార్డెన్ పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయడంతో పోలీసులు దర్యాప్తు చేశారు. బాలుడు గుత్తి మండలం మామిలూరులో బంధువుల ఇంట్లో ఉన్నట్లు గుర్తించి తీసుకువచ్చి వార్డెన్‌కు అప్పగించారు. కానిస్టేబుల్ నిఖిల్, హోంగార్డ్ బుగ్గప్ప, రామక్రిష్ణకు సీఐ జయన్న నగదు బహుమతితో అభినందించారు.

## వార్డు మెంబర్ల బాధ్యతలు కీలకం

**హాలహర్వి, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** పంచాయతీల్లో ఉప సర్పంచ్, వార్డుమెంబర్ల బాధ్యతలు కీలకమని ప్రత్యేకాధికారి రామంజినేయులు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. పంచాయతీ అస్తులను కాపాడాలన్నారు. ఎంపీడీవో వరలక్ష్మి, కార్యదర్శులు శ్రీనివాసులు, అబ్దుల్ అజీజ్, హరిబాబు, నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

**మద్దికెర అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి) :** జడ్పీ ఉన్న పాఠశాల 2008-2009 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు. చిన్ననగరి వీధిలో నివాసముంటున్న స్నేహితుడు జమేదార్ పృథ్వీరాజ్ ఇటీవల మృతి చెందాడు. పూర్వ విద్యార్థులు స్నేహితుని భార్య గాయత్రికి శుక్రవారం రూ.83,450 అందజేశారు. హరికృష్ణ, బాషా, నాగార్జున, దాదు, నాగరాజు, మస్తాన్, షేక్షా, జాఫర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## హాస్టల్ వద్ద మద్యం దుకాణం వద్దు

**ఆలూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రభుత్వ బీసీ కళాశాల హాస్టల్ వద్ద మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దని ఎస్ఎఫ్ఐ డీవైఎఫ్ఐ నాయకులు షైన, ఉమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్ర వారం ఎక్సైజ్ ఎస్ఐ నవీన్, డీటీ విజయ కుమార్‌కు వినతిపత్రం అందించారు. గోవర్ధన్, అఖిల్ నందన్, రాజశేఖర్ మణి, వీరేష్ పాల్గొన్నారు.

## పీఆర్సీ ఇవ్వకపోవడం అన్యాయం

**ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని ఇంతవరకు ఇవ్వకపోవడం అన్యాయమని ఎస్టీయూ అకడమిక్ కమిటీ సభ్యుడు మహదేవప్ప అన్నారు. శుక్రవారం ఆర్‌జీ నగర్ ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం నిరాశ పరిచలిందన్నారు. సుంకన్న, గోపాల్ పాల్గొన్నారు.

# ప్రయాణం.. నరకం

ఆదోని టౌన్: పట్టణంలోని ప్రధాన రోడ్డు ఇలా..



**గ్రామాలని లేదు.. పట్టణాలనీ లేదు రహదారులన్నీ దారుణంగా మారాయి. అసలే గుంతలు పడిన రోడ్లు, ఇక వర్షం కురిస్తే అంతే. వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.**



బినిగేరి గ్రామం వద్ద గుంతల దారిలో భారీ వాహనం

- ఆదోని-ఆస్పరి, ఆదోని-మంత్రాలయం రహదారుల్లో అడుగుకో గుంత..
- నిత్యం భారీ వాహనాల రాకపోకలు

**ఆదోని, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** డివిజన్‌లోని రహదారులు అధ్వానంగా మారి, అడుగుకో గుంత కనిపిస్తోంది. అయితే అధికారులు వీటికి మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఆదోని-మంత్రాలయం, ఆదోని-ఆస్పరి రహదారులు గుంతలమయంగా మారింది. ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇక రాత్రిళ్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిందే.

**భారీ వాహనాల రాకపోకలు..**

పట్టణంలో అతిపెద్ద మార్కెట్ యార్డు ఉంది. దీంతో డివిజన్ నుంచే కాకుండా ఇత ప్రాంతాల నుంచి కూడా పంట దిగుబడులు విక్రయాలకు తీసుకొస్తారు. జాతీయ రహదారి కావడంతో ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. బెంగళూరు, చెన్నై నుంయి హుబ్లీ, ధార్వాడ, ముంబై వెళ్లాల్సిన భారీ వాహనాలు సైతం ఈ రహదారి మీదనే వెళుతున్నాయి.

**భయం భయంగానే ప్రయాణాలు..**

రహదారులు గుంతలమయంగా ఉండటంతో వాహనచోదకులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రజా ప్రతినిదులు నిత్యం ఇదే రహదారిలో తిరుగుతున్నా పట్టించుకోక పోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని, నూతన రహదారులు వేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

## పొలాల్లో వర్షపు నీరు


**ఆలూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పొలాల్లోకి నీరు చేరి రైతులు ఆందోళన చెందుతున్నారు. కురకుంద, మరకట్టు, మణేకుర్తి, ఆలూరు, హత్తిబెళగల్, అరికేర, ముద్దనగేరి గ్రామాల్లో మిరప, పత్తి, కంది పప్పు, శనగ దెబ్బ తిన్నాయి. పెద్దహోతూరు-మరకట్టు, కాత్రికి-మునసవాళ్ళి, హత్తిబెళగల్-అర్దగేరి గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. కర్నూలు-ఆలూరు రహదారిలో గుంతలు ఏర్పడి, వనీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం భారీ వర్షం కురవడంతో ఆలూరు-మొలగవల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



కురకుందలో మిరప పంటలో వర్షపు నీరు

## తాగు నీటి సరఫరాపై దృష్టి

**ఆదోని టౌన్, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు కమిషనర్ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. ప్రజలు నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు.



ఫిల్టర్ బెడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణ

## దొంగ అరెస్టు

- ద్విచక్ర వాహనాల స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైకులతో పోలీసులు

**ఆదోని, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** అంతర్ జిల్లాల మోటార్ సైకిళ్ల దొంగను అరెస్టు చేసి 23 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ సోమన్న తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా, డోన్ మండలం కొత్త బురుజు గ్రామంలోని ఎరుకల కాలనీకి చెందిన ముంగ పెద్ద రంగనాయకులు అలియాస్ కొమరం పులి కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో బైకుల దొంగతనానికి పాల్పడుతున్నాడు. ఆదోని పట్టణంలోని రాంజల రోడ్డులో అనుమానాస్పదంగా బైక్ పై తిరుగుతుండగా సీఐ శ్రీరామ్ తనిఖీ చేసి పారిపోతుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. తాను నందికొట్కూరుకు చెందిన బైకు దొంగతనం చేసినట్లు తెలిపాడు. మొత్తం 23 వాహనాలు దొంగిలించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. రంగనాయకులు అలియాస్ కొమరం పులిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.23 లక్షల విలువగల 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన వన్ టౌన్ సీఐ శ్రీరామ్, ఎస్ఐ రామస్వామి, సిబ్బందిని డీఎస్పీ సోమన్న అభినందించారు.

## వినతులను పరిష్కరిస్తాం

**పత్తికొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** గత ప్రభుత్వం రీసర్వే చేసిన సమస్యలపై వినతులను విచారణచేసి పరిష్కరిస్తామని తహసీల్దార్ రమేష్ అన్నారు. శుక్రవారం దేవనబండలో వినతులను స్వీకరిం చారు. మొత్తం 33 వినతులు వచ్చాయని విచారణచేస్తామని తెలిపారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**తుగ్గలి అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, సర్పంచ్ ఓబులేసు, మిద్దె వెంకటేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ గురుస్వామి అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా తుగ్గలి, జొన్నగిరి, హుశేనాపురంలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు బాలన్న, తిరుపాల్‌నాయుడు, రవి కుమార్, వెంకటస్వామి, లక్ష్మనస్వామి, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పక్కీరప్ప, ఖలీల్, కృష్ణ, పులికొండ, సర్పంచ్ మస్తాన్‌బీ, జయచంద్ర, అంజి ఉన్నారు.

## విద్యార్థినులా? పనివాళ్లా..?

- బాలికోన్నత పాఠశాలలోటీ తేవడానికి విద్యార్థినులు

**పత్తికొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని బాలికోన్నతపాఠశాలలో విద్యార్థినులను ఉపాధ్యాయులు టీ తేవడానికి హోటళ్లకు పంపుతున్నారు. ఆడపిల్ల లను ఇలా పంపడం ఏంటని తల్లి దండ్రులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో 1,100 మంది విద్యార్థినులు చదువుతు న్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజు ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా టీ దుకాణానికి విద్యార్థులను పంప డం కనిపించింది. హెచ్ఎం బ్రమ రాంభను వివరణ కోరేందుకు వెళ్లగా సెలవులో ఉన్నానని సమాచారం. ఆమెను ఫోన్‌లో సంప్రదించగా మరోసారి ఇలా కాకుండా చూస్తామని తెలిపారు. కాగా ఈ విషయంపై విచారణచేస్తామని ఎంఈవో తిమ్మారెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు.



ఫ్లాస్కులో టీ తెస్తున్న విద్యారిని

## చంద్రబాబుతోనే గ్రామాభివృద్ధి

**ఆలూరు రూరల్, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి) :** గ్రామల అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని సర్పంచులు బురిజింటి ఎల్లప్ప, పీ మునెమ్మ, ఏపీవో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు వీరేశ్ అన్నారు. శుక్రవారం మరకట్టు, పెద్దహోతూరు గ్రామాల్లో పండుగలో రూ.20లక్షల సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాలకు పూర్వ వైభవం వచ్చిందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేసిందని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ పంచాయతీలకు నిధులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈసీ మారన్న, పంచాయతీ కార్యదర్శులు రామేష్, గర్జప్ప, టీడీపీ నాయకులు వెంకటేశ్వరులు, చిన్న రాముడు, జయ ప్రకాష్, కళ్యాణ్ బాబు, కెకెడీ, రామాంజి, ఉచ్చవీరప్ప పాల్గొన్నారు.



పెద్దహోతూరులో పనులు ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

## కూలీల వలస బాట

- తెలంగాణకు 40 కుటుంబాలు



తెలంగాణకు వలస వెళ్తున్న కురవళ్ళి గ్రామ కూలీలు

**ఆలూరు రూరల్, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీలు శుక్రవారం వలస బాటపట్టారు. మండలంలోని కురవళ్ళి గ్రామంలో 40 కుటుంబాలు శుక్రవారం రాత్రి విద్యార్థులు, చిన్నారులను తీసుకుని వలస వెళ్లారు. గ్రామాల్లో వంద రోజుల ఉపాధి పనులు లేవని కుటుంబ పోషణ భారంగా మారిదని కూలీలు తెలిపారు. గత్యంతరం లేక తెలంగాణ. గుంటూరు తదితర ప్రాంతాలకు మిరప, పత్తి పంట విడిపించేందుకు వెళుతున్నట్లు కూలీలు తెలిపారు.

## న్యూస్ బాక్స్

### 21న మెగా జాబ్ మేళా

**ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలల్లో ఈనెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ మురళిబాబు శుక్రవారం తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, బీటెక్ చదివిన వారికి ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. యంఎస్‌సీ జాబ్ మేళాను ఏర్పాటు చేశామన్నారు. సర్టిఫికెట్లను తీసుకురావాలని కోరారు. వివరాలకు సెల్ 9866278735 నంబర్లో సంప్రదిం చవచ్చు అన్నారు.

### భూ సమస్యలు పరిష్కరిస్తాం

**తుగ్గలి అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి):** వైసీపీ ప్రభుత్వం చేసిన రీసర్వేలో సమస్యలుంటే పరిష్కరిస్తామని తహసీల్దార్ నాగరాజు అన్నారు. శుక్రవారం లింగనాయునిదొడ్డిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూసమస్యలపై ఇచ్చిన అర్జీలు స్వీకరించారు. సర్వేయర్ సుధాకర్, వీఆర్వో వెంకట్రాముడు, టీడీపీ నాయకులు రాముడు ఉన్నారు.

### బాధితులకు న్యాయం చేయాలి : ఎస్పీ



స్టేషన్‌కు వస్తున్న ఎస్పీ

**పత్తికొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** బాధితులకు న్యాయం చేసేలా పనిచే యాలని ఎస్పీ బిందు మాధవ్ ఆదేశించారు. శుక్రవారం పత్తికొండ రూరల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. సర్కిల్‌లోని తుగ్గలి, జొన్నగిరి, మద్దికెరతో పాటు పత్తికొండ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ వెంకట్రామయ్య ఉన్నారు.

### పులి సంచారం కలకలం



పొలంలో పాదముద్రలు

**వెల్దుర్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** వెల్దుర్తి సమీపాన సుబ్బయ్య గుడి సమీపంలో శుక్రవారం పులి సంచరించినట్లు కలకం చోటుచేసుకుంది. రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అయితే పరిశీలించి ఇవి నక్క లేదా కుక్క అడుగులై ఉండ వచని అంచనా వేశారు. శనివారం క్షేత్రస్థాయికి వెళ్ళి ధ్రువీకరించనున్నట్లు యాపర్లపాడు ఫారెస్టు బీటర్ రేణుక తెలిపారు.

### వస్తారు, పోతారు.. సమస్యలు తీర్చరా?



ఎమ్మెల్యేను నిదీస్తున్న మహిళలు

**ఆదోని రూరల్ అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :** వస్తారు, చూస్తారు... పోతారు.. మా సమస్యలను తీర్చరా అంటూ పెద్దహరివాణం మహిళలు ఎమ్మెల్యే పార్థసారథిని నిలదీశారు. గ్రామంలో శుక్రవారం పల్లె పండుగ నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళిన పార్థసారథిని బీసీ కాలనీ మహిళలు నిలదీశారు. ఇంటి వద్ద ఉన్న మురుగును చూపిస్తూ, చూడండి సార్ రోడ్డు ఏలా ఉందో అంటూ వాపోయారు. అనంతరం రోడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.

### వ్యక్తి అరెస్టు

**ఆదోని రూరల్ అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** పెద్దకడుబూరు మండలం కల్లుకుంటకు చెందిన దుర్గప్పను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. వివరాల మేరకు.. బైక్‌లో కర్ణాటక మద్యం తరలిస్తుండగా, పెసల బండ క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

## సమయానికి బస్సులు నడపాలి



డిపోలో బస్సుకు అడ్డంగా కూర్చున్న విద్యార్థులు

**ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** పాఠశాల, కళాశాలల సమయానికి బస్సులు నడపాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు బస్టాండులో విద్యార్థులతో కలిసి వారు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలోని కడివెళ్ల మోడల్ స్కూల్, కాలేజి విద్యార్థులు బస్సులు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థులు బస్సు పాసులు తీసుకున్నా ప్రయోజనం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల కోసం గంటల తరబడి నిలబడ్డాల్సి వస్తోందని వాపోయారు. ఇది గమనించిన డిపో అధికారులు బస్సులు వేస్తామని చెప్పినా విద్యార్థులు శాంతించలేదు. తాము బస్సులు అడిగిన ప్రతి సారి ఇలానే చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో అధికారులు విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులను సముదాయించారు.

## ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపొద్దు



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

**ఎమ్మిగనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** ట్రూఅప్ చార్జీల పేరుతో మరోసారి ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపొద్దని సీపీఎం నాయకులు గోవిందు, రాముడు కోరారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడీఈకి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సురేష్ కుమార్, రవి, కాళప్ప, రాముడు, పరమేష్, మాబు, హుసేన్, బజారిలు పాల్గొన్నారు.

## మంచాలమ్మకు పంచామృతాభిషేకం

**మంత్రాలయం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. శుక్రవారం కార్తీక పాడ్యమి శుభ దినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాదిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

## గ్రామాల అభివృద్ధికి తోడ్పడండి

**మంత్రాలయం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఈవోఆర్డీ ప్రభావతి దేవి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ భవనంలో మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డుమెంబర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో రాధ, స్వామినాథ్, ఇశ్రాత్ బాషా, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

# కనీస సౌకర్యాలు కరువు

- 35 ఏళ్ల క్రితం చదువుల రామయ్య కాలనీ ఏర్పాటు
- నేటికీ సీసీ రోడ్డు, డ్రైనేజీలు లేవు
- పల్లెపండుగ కార్యక్రమంలోనైనా సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు



సీసీరోడ్డు, డ్రైనేజీ లేని చదువుల రామయ్య కాలనీ వీధి

**గోనెగండ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని చదువుల రామయ్య కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు. గత 35 ఏళ్ల క్రితం కమ్యూనిస్టు నాయకులతో కలిసి పోరాటం చేస్తే ప్రభుత్వం వంద గృహాలకు పట్టాలు ఇచ్చింది. నాటి నుంచి పంచాయతీకి పన్నులు కడుతున్నారు కానీ, సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్నాయి. ఓట్ల కోసం వచ్చిన ప్రతి నాయకుడిని తమ సమస్యలను పరిష్కరించమని వేడుకుంటున్నా ఇప్పటి వరకు ఏ నాయకుడు తమ కాలనీలో మౌలిక వసతులు కల్పించలేదని కాలనీవాసులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న పల్లెపండుగ కార్యక్రమంలోనైనా తమ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కాల నీవాసులు కోరుతున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి కొళాయిలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1990 నుంచి ఇప్పటి వరకు చదువుల రామయ్య కాలనీలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు నాయకులు స్పందించాలని కాలనీ పెద్దలు చెన్నలరాయుడు, సూరి, అంజి, రామక్క, ఈరన్న కోరుతున్నారు.

**వసతులు కల్పించాలి**



గత 35 ఏళ్లుగా మా కాలనీని ఏ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. సీసీరోడ్డు డ్రైనేజీలు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. పల్లెపండుగ కార్యక్రమంలోనైనా మా కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు చేసడితే బాగుంటుంది. అధికారులు స్పందించాలి.

- చెన్నలరాయుడు, చదువుల రామయ్య కాలనీ, గోనెగండ్ల.

## సబ్ కోర్టు మంజూరు

**ఎమ్మిగనూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న జూనియర్ సివిల్ జడ్జీ కోర్టుకు హైకోర్టు ఒక సబ్ కోర్టు మంజూరు చేయటం తోపాటు ఐదు సివిల్, క్రిమినల్ అడిషనల్ కోర్టులను మంజూరు చేసినట్లు బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంకే గురురాజరావు, రఘురాం తెలిపారు. కొన్నేళ్లుగా సబ్ కోర్టు, అడిషనల్ కోర్టుల కోసం స్థానిక న్యాయవాదులు, రాజకీయ పార్టీల నాయకులు కృషి చేస్తువచ్చారు. ఎట్టకేలకు హైకోర్టు సబ్ కోర్టును, అడిషనల్ కోర్టులను మంజూరు చేయటంతో బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## మెనూ పాటించాలి: ఎంఈవో

**మంత్రాలయం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని ఎంఈవో రాఘన్న హెచ్చరించారు. శుక్రవారం చిలకలడోణ జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను ఆంగ్లం, గణితం, సైన్సు సబ్జెక్టులపై ప్రత్యేక స్టడీ అవర్స్ ఏర్పాటు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎంలు జాన్సన్, నాగేంద్రప్ప, నాగరాజు, సునీత, రామ్మోహన్, క్రిష్ణవేణి, వీరేష్, సుధాకర్ పాల్గొన్నారు.

# భూ సమస్యలు పరిష్కరిస్తాం

గ్రామసభల్లో రెవెన్యూ అధికారులు

**మంత్రాలయం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** గత ప్రభుత్వంలో రీసర్వేలో భూముల అవకతవకలు కొలతల్లో తేడాలు వంటి సమస్యలుంటే పరిష్కరిస్తామని తహసీల్దారు రవి అన్నారు. శుక్రవారం మండలంలోని కాచాపురంలో రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. 17మంది రైతులు అర్జీలు తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అశోక్, ఆర్ఐ ఆదాం, వీఆర్ఓ పుష్ప, రైతులు పాల్గొన్నారు.

**కోసిగి:** మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో శుక్రవారం కలవల గుండు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో తహసీల్దార్ నిత్యానందరాజు, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడుకు రైతులు 15 అర్జీలు అందజేశారు. రీసర్వే ద్వారా జాయింట్ ఎల్‌పీఎమ్స్ నెంబర్లు ఉన్నాయని, తమకు వేర్వేరుగా ఎల్‌పీఎమ్స్ నెంబర్లు అందజేయాలని రైతులు అర్జీలు అందజేశారు. కలవలగుండులో 574 ఎకరాల 90 సెంట్ల భూమి ఉందని, 358 ఎల్‌పీఎంఎస్ రైతులు ఉన్నారని జాయింట్ ఎల్‌పీఎంఎస్ 21 ఉన్నాయని అన్నారు. ఈ గ్రామసభలో ఆర్ఐ శ్రీరాములు, సర్వేయర్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు. అలాగే 19న మూగలదొడ్డి, 22న పల్లెపాడు, 23న పెండేకల్, 24న గుట్టకుంట, 25న వందగల్లు, 26న ఎండపల్లి, 29న జుమాలదిన్నె, 30న కడిదొడ్డి, నవంబరు 1న జంపాపురం, 2న కోసిగి, 5న అగసనూరు, 6న సజ్జలగుడ్డం, 7న ఆర్లబండ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు.

**కౌతాళం:** రైతులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం రీ సర్వే పేరుతో వచ్చేనెల 13వరకు అర్జీలు స్వీకరిస్తోందని తహసీల్దార్ మల్లికార్జునస్వామి తెలిపారు. మండల పరిధిలోని గోతులదొడ్డి గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్, సతీష్ నాయుడు, ఎంపీడీఓ సుబ్బరాజు, పంచాయతీ కార్యదర్శి శివప్ప ఉన్నారు.

**ఎమ్మిగనూరు రూరల్:** రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో 60కి పైగా సమస్యలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, సీనియర్ ఇసిస్టెంట్ జ్యోతి, వీఆర్వోలు జ్యోతి, ఈరన్నలు పాల్గొన్నారు.

**నందవరం:** ప్రభుత్వ చేపట్టిన గ్రామ సభలతో రైతుల సమస్యలు పరిష్కారమౌతాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహింపురంలో గ్రామ సభ ఆర్ఐ జర్మియా ఆధ్వర్యంలో నిర్వహించారు. సమవేశంలో మండల సర్వేయర్ అక్బర్‌బాష, ముగతి శేఖర్, వీఆర్వో చిన్న కొండన్న, సర్వేయర్ తేజశ్విని, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మారెప్ప, శంకరమ్మ, నరసింహులు పాల్గొన్నారు.

**గోనెగండ్ల:** రీ సర్వేలలో జరిగి పొరపాట్లను సరిచేసేందుకు గాను ఆయా గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రబాడు గ్రామంలో భూ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు దాదాపు 100 మంది అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీషా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



తహసీల్దారుకు అర్జీలు ఇస్తున్న రైతులు

## సమస్యలు పరిష్కరించాలి

**ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సత్యన్న డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును తనిఖీ చేసేందుకు వచ్చిన ఏడీఎం నారాయణమూర్తికి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు, బాబు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లను బెదిరించడం సరికాదు

**ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో ఆశా వర్కర్లను మెడికల్ అధికారులు బెదిరించడం సరికాదని సీఐటీయూ నియోజకవర్గ అధ్యక్షుడు రాముడు, ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి అన్నారు. శుక్రవా రం ఏరియా ఆస్పత్రిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఆశా వర్కర్లకు జాబ్‌చార్టులో లేని పనులు మెడికల్ అధికారులు చేయిస్తున్నారన్నారు. బెదిరింపులు ఆపకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడు తామని హెచ్చరించారు. సమావేశంలో ధనలక్ష్మి, రాణి, సుమిత్ర పాల్గొన్నారు.

## టీడీపీతోనే ఇంటింటికీ కొళాయి

**నందవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** ఇంటింటికీ కొళాయి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ నాయకులు గురురాజారావు అన్నారు. శుక్రవారం నందవరం ఎస్సీ కాలనీలో చేపడుతున్న జల్‌జీవన్ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసన్న కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా రూ కోటి 15లక్షలతో చేపడుతున్నాడని కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్న గౌడు, సాధిక్ పాల్గొన్నారు.

## లెదర్ సొసైటీ డైరెక్టర్ మృతి

**ఎమ్మిగనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలోని లెదర్ సొసైటీ డైరెక్టర్ అంజినయ్య(68) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అంజి నయ్య పట్టణంలోని ఎస్సీకాలనీలో నివాసం ఉంటున్న అంజినయ్య 40ఏళ్లుగా చర్మకార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అలాగే పట్టణంలో ఉన్న ది ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ లెదర్ సొసైటీ డైరెక్టర్‌గా ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఈయన మృతిపై దళిత, ప్రజాసంఘాలు, ఎస్సీకాలనీలోని వివిధ పార్టీల నాయకులు విచారం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు కదిరికోట ఆదేన్న, కనకవీడు రాజు, ఇసాకులు అంజినయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

## పంటలు దెబ్బతిన్నకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**గోనెగండ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** ప్రస్తుతం వర్షాల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత అన్నారు. వేముగోడు గ్రామంలో పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, ఉల్లి, వరి తదితర పంటలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల చీడపీడలు ఎక్కువై పంట దిగుబడి తగ్గుతుందన్నారు. అలాగే మొక్కజొన్న పంటలో వర్షం ఎక్కువైనప్పుడు పొలంలోని నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపివేయాలన్నారు. కాండం తొలుచు పురుగు,ఆకు ఎండుతెగులు రాకుండా చూసుకోవాలని కోరారు.

## రైతు క్షేమమే టీడీపీ ధ్యేయం

**కౌతాళం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** రైతు క్షేమమే టీడీపీ ధ్యేయమని తెలుగు రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకం`సలతో మాట్లాడారు. వల్లూరు గ్రామంలో ఉన్న చెరువు కింద దాదాపు 300ఎకరాల మాగాణి ఉందని, చెరువు నీటి ద్వారా రైతులు పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం చెరువులో నీరు తక్కువగా ఉందని, రైతులు తన దృష్టికి తీసుకవచ్చారన్నారు. దాంతో అధికారులతో మాట్లాడి వల్లూరు చెరువుకు ఎల్ఎల్‌సీ కాలువ నీరు విడుదల చేయించామని తెలిపారు.

## గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

**గోనెగండ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకయని ఎంపీడీవో మణిమంజరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశ భవనంలో ఆయా గ్రామాల వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులలో మీ పాత్ర చాల ముఖ్యమైనదని ప్రతి గ్రామ పంచాయతీ సమావేశానికి వార్డు సభ్యులు తప్పని సరిగా హాజరుకావాలని సూచించారు. వార్డు సభ్యుల విధులను, బాధ్యతలను వివరించారు. సమావేశంలో ఈవోఆర్డీ అనంతసేన, పంచాయతీ కార్యదర్శి తాటికొండ వెంకటేశ్వర్లు, బైలుప్పల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

## జిన్నింగ్ మిల్లుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

**ఎమ్మిగనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణ శివారులో ఉన్న పత్తి జిన్నింగ్ మిల్లులు, పత్తి దుకాణాలు, నందవరం మండలం నాగలదిన్నె గ్రామంలో ఉన్న వ్యవసాయ చెక్ పోస్టును జిల్లా మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ బృందం ఆకస్మిక తనిఖీ చేసింది. శుక్రవారం జిల్లా ఏడీఎం నారాయణ మూర్తి ఆధ్వర్యంలో విజిలెన్స్ బృందం అధికారులు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న పత్తి దుకాణాలను, పట్టణ శివారులో ఉన్న జిన్నింగ్ ఫ్యాక్టరీలను తనిఖీ చేశారు. మార్కెట్‌కు సెస్సు సక్రమంగా చెల్లిస్తున్నారా, లేదా అనే విషయాలను రికార్డులను పరిశీలించారు. అలాగే ఏమేరకు పత్తి రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు, తూకాలు సక్రమంగా ఉంటున్నాయా అనే విషయాలను పరిశీలించారు. అలాగే నందవరం మండలం నాగలదిన్నే గ్రామంలో తుంగభద్ర నది దగ్గర ఉన్న వ్యవసాయ చెకపోస్టును తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనుమతులు లేకుండా పత్తి కొనుగోలు చేస్తున్న వారికి నోటీసులు జారీచేశామని, అనుమతులు తీసుకోని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ బృందం అధికారులు కేశవరెడ్డి, మోహన్ రెడ్డి, శివన్న ఉన్నారు.

## ఎమ్మిగనూరులో భారీ వర్షం



పాత పదకొండో వార్డులోని వీధిలో మోకాళ్లలోతు నిలిచిన వర్షపు నీరు

**ఎమ్మిగనూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం కురవటంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా పాత పదకొండవ వార్డులో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. అలాగే ప్రధాన రహదారులైన అంబేడ్కర్ సర్కిల్, గాంధీ సర్కిల్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, ట్యాంక్ బండ్ రోడ్డు, ఎద్దుల మార్కెట్ రోడ్డు, బస్టాండ్ రోడ్డు వర్షం నీటితో జలమయమయ్యాయి. రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలు పొంగిపొర్లడంతో నీరు రోడ్లపైకి చేరాయి. అలాగే పట్టణ శివారులోని గోనేగండ్ల సర్కిల్‌లో రోడ్డుపై ఉన్న గుంతల్లో భారీగా వర్షం నీరు చేరింది.